ప్రజా **రిపబ్లిక్**
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 136 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
ఆదివారం 22 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# సీఎం చంద్రబాబు భద్రతకు అటానమస్ డ్రోన్ల సహాయంతో పర్యవేక్షణ

**ఏపీ సీఎం చంద్రబాబు సాంకేతిక సాయాన్ని వినియోగించుకుంటూ తనకున్న భద్రతను గణనీయంగా తగ్గించుకున్నారు.**



**అమరావతి, డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ సీఎం చంద్రబాబు సాంకేతిక సాయాన్ని వినియోగించుకుంటూ తనకున్న భద్రతను గణనీయంగా తగ్గించుకున్నారు. భారీ భద్రత, బందోబస్తుకు దూరంగా ఉంటున్నారు. సీఎం నివాసంలో అటానమస్ డ్రోన్ల సాయంతో పరిసరి ప్రాంతాల భద్రత పర్యవేక్షణను పోలీసులు చేపట్టారు.తక్కువ మంది సిబ్బంది, టెక్నాలజీ సాయంతో ప్రణాళికతో వ్యవహరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు ఉండవల్లిలోని సీఎం నివాసంలో అత్యాధునిక డ్రోన్ను ఏర్పాటు చేశారు. ఆ డ్రోన్ తనకు ప్రోగ్రాం ఇచ్చిన విధంగా ప్రతి రెండు గంటలకు ఒకసారి పరిసర ప్రాంతాల్లో ఎగిరి వీడియోను షూట్ చేస్తుంది. సాధారణ పరిస్థితుల కంటే భిన్నంగా ఏవిధమైన మూమెంట్ కనిపించినా.. కొత్త, అనుమానాస్పద వస్తువులు కనిపించినా మానిటరింగ్ టీమ్కు మెసేజ్ పంపుతుంది. సీఎం నివాసంలో పెట్టిన ఈ డ్రోన్ అటానమస్ విధానంలో ఆటోపైలట్గా ఆయా ప్రాంతాల్లో ఎగురుతుంది. మళ్లీ వచ్చి నిర్దేశిత దక్కె ల్యాండ్ అయి తానే ఛార్జింగ్ పెట్టుకుంటుంది. ఈ డ్రోన్ పంపే డేటాను విశ్లేషించడం ద్వారా ఇంటి పరిసర ప్రాంతాల్లో సెక్యూరిటీని అధికారులు పర్యవేక్షిస్తున్నారు.ప్రజలు, పార్టీ కార్యకర్తలను తనకు దూరం చేసేలా బందోబస్తు ఉండరాదని సీఎం చంద్రబాబు ఎన్ని సార్లు ఆదేశించినా.. ప్రొటోకాల్ నిబంధనల పేరుతో అధికారులకు అది కష్టతరంగా మారింది. సమస్యను అధిగమించేందుకు డ్రోన్ సాంకేతికత ద్వారా తనకున్న సిబ్బందిని ముఖ్యమంత్రి చంద్రబాబు గణనీయంగా తగ్గించేశారు. అన్ని జిల్లాల అధికారులు ఈ ఆదేశాలు పాటించాలని ప్రభుత్వం తేల్చి చెప్పింది. సీఎం ఆదేశాలతో భద్రతలో సమూల మార్పులు చేశారు. వైకాపా హయాంలో ముఖ్యమంత్రికి 980 మందితో భద్రత కల్పించేవారు. ప్రస్తుతం చంద్రబాబుకు కేవలం 121 మందితో భద్రత కల్పిస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కాన్వాయ్లో 17 వాహనాలు ఉండగా.. జడ్ ప్లస్ భద్రత ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబు వాహన శ్రేణి 11 వాహనాలకే పరిమితమైంది.

# రూ.20 కోట్ల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న అస్సాం పోలీసులు



**అస్సాంలో తరలిస్తున్న డ్రగ్స్ను పోలీసులు పట్టుకున్నారు.**

**గువాహటి, డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** అస్సాంలో పోలీసులు భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారంతో దాదాపు 125 గ్రాముల హెరాయిన్ 60,000 యాబా టాబ్లెట్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఐజీ పార్థసారథి మహంత పేర్కొన్నారు. దీని విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు.కాచర్ జిల్లాలోని సిల్కూరి రోడ్డు వద్ద ఓ వ్యక్తి మాదకద్రవ్యాలను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు, స్పెషల్ టాస్క్ఫోర్స్ (ఎస్ఎఫ్) సంయుక్తంగా సోదాలు చేపట్టాయని పేర్కొన్నారు. సాహిల్ అహ్మద్ లస్కర్ అనే వ్యక్తి డ్రగ్స్ను తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. దీని వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వీటిని ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ప్రకాశం జిల్లాలో మరోసారి భూ ప్రకంపనలు

**ముండ్లమూరు, డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** ప్రకాశం జిల్లాలో మరోసారి భూ ప్రకంపనలు వచ్చాయి.ముండ్లమూరు మండలంలో భూమి సెకను పాటు కంపించింది. ముండ్లమూరు, సింగన్నపాలెం, మారెళ్లలో ప్రకంపనలు వచ్చాయి. దీంతో పలువురు భయాందోళనకు గురయ్యారు. శనివారం కూడా ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లోని పలు గ్రామాల్లో స్వల్పంగా భూ ప్రకంపనలు వచ్చాయి.



# తిరుమలలో అనధికార దుకాణాలపై త్వరలో కఠిన చర్యలు: తితిదే ఈవో

**ప్రక్షాళనలో భాగంగా అనేక చర్యలు చేపట్టామని తితిదే ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.**



**తిరుమల, డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** ప్రక్షాళనలో భాగంగా అనేక చర్యలు చేపట్టామని తితిదే ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని ఆదేశించారన్నారు. ఆలయ పవిత్రతను కాపాడే విధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తిరుమల పర్యటనను ప్రతి భక్తుడు గుర్తు పెట్టుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు."అన్న ప్రసాదాలు, లడ్డూ ప్రసాదం నాణ్యత పెంచాం. భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయం తగ్గించాం. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాం. తిరుమలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాం. 2047 తిరుమల విజన్లో భాగంగా అనేక కార్యక్రమాలు చేయాలి. దాతలు నిర్మించిన అతిథి గృహాల్లో 20 గృహాలకు ఆధ్యాత్మిక పేర్లు పెట్టాలి. అలిపిరి నడక మార్గంలో సౌకర్యాలు, తిరుమలలో పార్కింగ్ సౌకర్యం పెంచాలి. అన్యమత ఉద్యోగుల బదిలీపై న్యాయపరంగా వెళున్నాం. తిరుమలలో అనధికార దుకాణాల వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరలో వీటిపై కఠిన చర్యలు తీసుకుంటాం. లడ్డూ ప్రసాదానికి స్వచ్ఛమైన నెయ్యిని వినియోగిస్తున్నాం. దేశవ్యాప్తంగా తితిదేకి 61 అనుబంధ ఆలయాలు ఉన్నాయి. కన్సల్టెన్సీ ద్వారా ఆలయాల అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద పార్కింగ్ సమస్యలు ఉన్నాయి. ఆకాశ గంగ, పాప వినాశనం తీర్థాలకు భక్తుల తాకిడి పెరిగింది. ఆ తీర్థాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ విభాగంలో లోటుపాట్లు జరిగాయి. ఈ లోటు పాట్లు జరగకుండా ఒక కమిటీని వేస్తున్నాం. గత ఆరు నెలలుగా తితిదే విజిలెన్స్ అధికారులు బాగా పని చేస్తున్నారు. దర్శన టికెట్లు ఇస్తామని భక్తులను మోసం చేసే వారిని పట్టుకుంటున్నారు" అని శ్యామలారావు అన్నారు.

# ఆయన సినీ హీరో కావొచ్చు.. పరిస్థితులను అర్థం చేసుకోవాలి : తెలంగాణ డీజీపీ జితేందర్

**పౌరులుగా అందరూ బాధ్యతాయుతంగా ఉండాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. సంధ్య థియేటర్ ఘటనపై ఆయన స్పందించారు.**



**కరీంనగర్, డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** పౌరులుగా అందరూ బాధ్యతాయుతంగా ఉండాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. సంధ్య థియేటర్ ఘటనపై ఆయన స్పందించారు. వ్యక్తిగతంగా తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా డీజీపీ మాట్లాడారు."సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరం. అల్లు అర్జున్ కు మేం వ్యతిరేకం కాదు. చట్ట ప్రకారం ఆయనపై చర్యలు తీసుకున్నాం. పౌరుల భద్రత, రక్షణ అన్నింటికంటే ముఖ్యం. ఆయన సినీ హీరో కావొచ్చు.. క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు పౌరుల భద్రతకు మంచిది కాదు. ప్రజల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యమైన అంశం కాదు. జర్నలిస్టుపై దాడి కేసులో సినీనటుడు మోహన్ బాబు పై కేసు నమోదు చేశాం. చట్ట ప్రకారం ఆయనపై చర్యలు ఉంటాయి.మహిళలు, చిన్నారుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల భద్రత కోసం 24 గంటలు పని చేస్తున్నాం. తెలంగాణ ప్రభుత్వం చొరవ వల్లే భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. వీటి ఏర్పాటును సుప్రీంకోర్టు కూడా ప్రశంసించింది. ఇతర రాష్ట్రాల అధికారులు వచ్చి భరోసా కేంద్రాలను సందర్శిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కేంద్రాలు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం. దీని వల్ల మహిళలు, చిన్నారులకు మరింత భద్రత పెరుగుతుంది. మహిళలకు ఎలాంటి సమస్యలున్నా భరోసా కేంద్రానికి రావొచ్చు. ఇక్కడ న్యాయ నిపుణుడు, డాక్టర్ ఉంటారు. ఎలాంటి సమస్యలనైనా పరిష్కరిస్తారు" అని డీజీపీ జితేందర్ చెప్పారు.

# కాంగోలో పడవ బోల్తా.. 38 మంది మృతి

**కాంగోలోని బుసిరా నదిలో పడవ బోల్తా పడి 38 మంది ప్రాణాలు కోల్పోయారు..**



**డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** కాంగో లోని బుసిరా నదిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పడవ బోల్తా పడి 38 మంది మృతి చెందారు. ఈ ఘటలో 100 మందికి పైగా గల్లంతయినట్లు అధికారులు తెలిపారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తుండటంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.ఫెర్రీ లో 400 మందికి పైగా ప్రయాణికులు ఉనట్లు స్థానికులు పేర్కొన్నారు. వారంతా క్రిస్మస్ వేడుకల కోసం సొంతూళ్లకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గల్లంతైన వారిలో ఇప్పటివరకు 20 మందిని రక్షించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఫెర్రీ సిబ్బంది సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని అధికార వర్గాలు తెలిపాయి. నాలుగురోజుల క్రితం సైతం ఓ నదిలో పడవ బోల్తా పడి 25 మంది మృతి చెందారు. ఈ క్రమంలోనే మరో ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలించవద్దని అక్కడి అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులను తరలించే పడవలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

# జైశంకర్ కు నేషనల్ ఎమినెన్స్ అవార్డు


**కేంద్ర విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి నేషనల్ ఎమినెన్స్ అవార్డు అందుకున్నారు.**



**డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్ శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి నేషనల్ ఎమినెన్స్ అవార్డు అందుకున్నారు. పబ్లిక్ లీడర్ షిప్ విభాగంలో సౌత్ ఇండియన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో జైశంకర్ మాట్లాడుతూ దేశంలోని పురాతన విద్యా సంస్థల్లో ఒకటైన ఎస్ఐఎస్ తనకు ఈ అవార్డు బహూకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలకు మహా పెరియవర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.ప్రస్తుతం భారత్ ప్రపంచ దేశాలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ స్వతంత్ర శక్తిగా స్థిరపడుతోందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో శాంతి స్థాపనకు కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా శ్రీఅన్న (మిల్లెట్స్)ని పునరుజ్జీవింపజేయడం, యోగాను ప్రపంచదేశాల్లో ప్రాచుర్యంలోకి తీసుకురావడం వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. మన ఆలోచనలు, సామర్థ్యాలపై విశ్వాసంతో ముందుకు వెళ్లినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.

# అల్లు అర్జున్ లో పశ్చాత్తాపం కనిపించట్లేదు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సీఎం రేవంత్ రెడ్డి మాటలను తప్పు పట్టేలా సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహరిస్తున్నారని, ఆయన తీరు దారుణంగా. ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.**



**హైదరాబాద్, డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి మాటలను తప్పు పట్టేలా సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహరిస్తున్నారని, ఆయన తీరు దారుణంగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అల్లు అర్జున్ ప్రెస్మీట్ నేపథ్యంలో స్పందించారు."అల్లు అర్జున్ కనీసం పశ్చాత్తాపం కనిపించట్లేదు. రేవతి కుటుంబంపై సానుభూతి చూపించలేదు. మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ తెచ్చిన ప్రస్తావన పైనే సీఎం స్పందించారు. పోలీసులు చెప్పినా వినకుండా అల్లు అర్జున్ థియేటర్ లో షో చేశారు. ప్రాణాల కంటే ఆయనకు పేరు ప్రతిష్ఠలు ఎక్కువా?" అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.

# అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర: బండి సంజయ్

**సినీ పరిశ్రమపై పగబట్టినట్లుగా సీఎం రేవంత్రెడ్డి వ్యవహరిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్**



**హైదరాబాద్, డిసెంబర్ 21, (రిపబ్లిక్ న్యూస్):** సినీ పరిశ్రమపై పగబట్టినట్లుగా సీఎం రేవంత్రెడ్డి వ్యవహరిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మృతిని అందరూ ఖండించారన్నారు. శ్రీతేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని చెప్పారు. మృతురాలి కుటుంబానికి అందరూ బాసటగా నిలిచారన్నారు. ఈ సమస్య ముగిశాక అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించారని.. సినిమా తరహా కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించారని బండి సంజయ్ ఆరోపించారు."ప్రణాళిక ప్రకారం అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేశారు. అల్లు అర్జున్ వ్యక్తిత్వ హననం చేసేలా సీఎం రేవంత్రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గతంలో భారాసను ఎంఐఎం నిండా ముంచింది. ఎంఐఎంను నమ్మితే కాంగ్రెస్కూ భారాస గతే పడుతుంది. కలుషిత ఆహారం తిని గురుకుల విద్యార్థులు చనిపోతున్నారు. వారి కుటుంబాలను సీఎం ఏనాడైనా పరామర్శించారా? ఆ మరణాలకు మీరు బాధ్యత వహించారా? మీకో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా? ఇకనైనా రేవంత్ కక్ష సాధింపు చర్యలు వీడాలి" అని బండి సంజయ్ అన్నారు.

# 'గేమ్ ఛేంజర్'.. శంకర్ బెస్ట్ మూవీని చూడబోతున్నారు: రామ్ చరణ్

## రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్ మూవీ ప్రీరిలీజ్ వేడుక అమెరికాలోని డల్లాస్లో ఘనంగా జరిగింది. భారీ సంఖ్యలో అభిమానులు ఈ ఈవెంట్లో పాల్గొన్నారు.




దర్శకుడు శంకర్ అభిమానులు 'గేమ్ ఛేంజర్' రూపంలో ఓ బెస్ట్ మూవీని చూడబోతున్నారని రామ్చరణ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. కియారా అద్వాణీ కథానాయిక. దిల్ రాజు నిర్మాత. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇప్పటివరకూ ఏ భారతీయ సినిమాకు నిర్వహించని విధంగా అమెరికాలోని డల్లాస్ 'గేమ్ ఛేంజర్ గ్లోబల్ ఈవెంట్ పేరుతో ప్రీరిలీజ్ వేడుక జరిపారు.ఈ సందర్భంగా కథానాయకుడు రామ్చరణ్ మాట్లాడుతూ..

"ఈవెంట్ చూస్తుంటే, నేను అమెరికాకు వచ్చినట్లు లేదు. తిరిగి ఇండియాకు వెళ్లినట్లు ఉంది. మంచి సినిమా అందిస్తే మీరు (ప్రేక్షకులు) బాగా ఆదరిస్తారు. సరైన సినిమాలు తీయకపోతే.. అంతే స్థాయిలో విమర్శిస్తూ తిరస్కరిస్తారు. మీరెప్పుడూ అలాగే ఉండండి. కానీ, నేను హామీ ఇస్తున్నా. 'గేమ్ ఛేంజర్' అద్భుతమైన అనుభూతిని ఇస్తుంది. శంకర్ గారి ప్రతి అభిమానికి ఇదొక బెస్ట్ ఫిల్మ్ అవుతుంది. ఈ సంక్రాంతికి మా సినిమా లేకపోతే, కల్యాణ్ బాబాయ్ని బలవంత పెట్టి అయినా.. ఆయన సినిమా రిలీజ్ అయ్యేలా చేసేవాడిని. అసలు 'గేమ్ ఛేంజర్' డిసెంబరులో రావాలి. సంక్రాంతి డేట్ ఇచ్చిన చిరంజీవిగారికి, యూవీ ప్రొడక్షన్స్ వాళ్లకు ధన్యవాదాలు చెబుతున్నా. మామూలుగా అన్ని విషయాల్లో దిల్ రాజు గారు మార్కులు కొట్టేస్తారు. కానీ, తవ-ఎన్ కూడా ఎక్కడా తగ్గలేదు. మనవాడు కూడా మార్కులు కొట్టేశాడు. 'మీకు ఎన్నవేణమో.. అన్ని ఇరుక్కింగా.." అంటూ తమిళ్లో మాట్లాడి రామ్చరణ్ నవ్వులు పూయించారు.తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న చాలా ఘటనలు 'గేమ్ ఛేంజర్ లో కనిపిస్తాయని నిర్మాత దిల్రాజు అన్నారు. అవన్నీ నాలుగేళ్ల కిందట శంకర్గారు రాసుకున్న సన్నివేశాలని తెలిపారు. అవే ఇప్పుడు ప్రేక్షకులతో క్లాప్స్ కొట్టిస్తాయన్నారు. 'గేమ్ ఛేంజర్' హై ఓల్టేజ్ మూవీ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందులో కీలక పాత్ర పోషించిన నటుడు ఎస్ జే సూర్య మాట్లాడుతూ రామ్చరణ్పై ప్రశంసలు కురిపించారు. 'చిరంజీవి కుమారుడు రామ్చరణ్ నిజంగా కింగ్. ఎందుకంటే ఆయన ప్రవర్తన, మనసు, వ్యవహారశైలి, నడక, నటన అంతా కింగ్ ఉంటుంది. నా మొబైల్ లో ఆయన నంబర్ 'ఆర్.సి. ది కింగ్ అని ఉంటుంది. నేను ఏది ఫీలవుతానో అదే మాట్లాడతా. ఆయనతో నటించడం చాలా సంతోషంగా ఉంది. అన్ని సన్నివేశాలకు నేనే డబ్బింగ్ చెప్పాను. హిందీలో కూడా చెప్పాను. ఎందుకంటే ఆ ఎనర్జీని ఈ మూవీ, అందులోని సన్నివేశాలు నాకు ఇచ్చాయి. అదే ఎనర్జీ మీకు తెరపై కనపడుతుంది' అని అన్నారు. తనకు బాగా కనెక్ట్ అయిన నటుడు రామచరణ్ అని దర్శకుడు సుకుమార్ అన్నారు. భారీగా తరలి వచ్చిన అభిమానులు డల్లాస్లో జరిగిన 'గేమ్ ఛేంజర్ ప్రీరిలీజ్ ఈవెంట్ కు



భారీగా అభిమానులు తరలివచ్చారు. స్థానికంగా ఉన్న తెలుగువారితో పాటు, ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న వారు కూడా వచ్చి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆడిటోరియం మొత్తం సందడిగా మారింది. కార్యక్రమంలో దర్శకుడు బుచ్చిబాబు, నటి అంజలి, సంగీత దర్శకుడు తమన్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## 'సలార్' నన్ను కాస్త నిరాశపరిచింది.. పార్ట్2 మీ ఊహలకు అందదు: ప్రశాంత్ నీల్


ప్రభాస్ కథానాయకుడిగా రూపొందిన 'సలార్' విజయం తనకు ఆశించిన సంతోషాన్ని ఇవ్వలేదని దర్శకుడు ప్రశాంత్ నీల్ అన్నారు.




ప్రభాస్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటించిన 'సలార్: పార్ట్-1 సీజ్ ఫైర్' ఫలితం విషయంలో అంత సంతోషంగా లేనని దర్శకుడు ప్రశాంత్ నీల్ అన్నారు. ఆయన రూపొందించిన ఈ మూవీ విడుదలై ఏడాది పూర్తయింది. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడమే కాదు, రూ.700 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రశాంత్ నీల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."ఉగ్రం'ను సరిగ్గా చెప్పలేకపోయాననే ఉద్దేశంతోనే మళ్లీ దాన్ని చెప్పాలనుకున్నట్లు గతంలో చెప్పారు. మరి 'సలార్%శ్రీ%' ఫలితం మీకు థియేటర్లో ఆ స్థాయి సంతోషాన్ని ఇచ్చిందా?' అని ప్రశ్నించగా.. "సలార్-1' ఫలితంతో నేను సంతోషంగా లేను. ఫస్ట్ పార్ట్ కోసం నేను పడిన కష్టంతో పోలిస్తే, కాస్త నిరాశగానే అనిపించింది. ఎక్కడో 'కేజీయఫ్ 2' ఛాయలు కనిపించాయి. ఇక ఎప్పుడూ అలా జరగదు. 'సలార్ 2' మాత్రం నా కెరీర్లో బెస్ట్ మూవీగా తీస్తా. ప్రేక్షకుల అంచనాలను మించేలా తీర్చిదిద్దుతా. జీవితంలో కొన్ని విషయాలపై చాలా స్పష్టతతో ఉన్నా. మరోసారి చెబుతున్నా, ఎవరూ ప్రశ్నించే వీలు లేకుండా 'సలార్ 2' నా బెస్ట్ మూవీల్లో ఒకటిగా ఉంటుంది" అని ప్రశాంత్ నీల్ చెప్పాడు.'సలార్ పార్ట్2: శౌర్యంగ పర్వం' కోసం ప్రభాస్ అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, ఇది రావడానికి చాలా సమయమే పట్టే అవకాశం ఉంది. ఎందుకంటే ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్ తో మూవీ చేస్తున్నారు. 2025 ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉంది. మరోవైపు ప్రభాస్ కూడా వరుస సినిమాలో బిజీగా ఉన్నారు. ఇటీవలే 'సలార్2' పనులు మొదలు పెట్టినట్లు చిత్ర నిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్ ప్రకటించింది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- సంవత్సరంలో అతితక్కువ పగటి సమయం ఉండే రోజు. ఐతే, ఇది ఉత్తరార్ధగోళానికి మాత్రమే పరిమితం. దక్షిణార్ధ గోళంలొ ఇది జూన్ నెలలో సంభవిస్తుంది. మరో విషయం ఏమంటే, ఈరోజు కొన్ని సంవత్సరాలలో డిసెంబరు 21న లేదా 22న కూడా కావచ్చును. భారతదేశంలో జాతీయ గణిత దినోత్సవం.
- 1666: సిక్కుమత పదవ గురువు గురు గోవింద సింగ్ జననం (మ.1708).
- 1853: ప్రసిద్ధ ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస భార్య,యోగిని, శారదా మాతగా ప్రసిద్ధిచెందిన శారదా దేవి జననం (మ.1920).
- 1887: గణిత శాస్త్రవేత్త, శ్రీనివాస రామానుజన్ జననం (మ.1920). (చిత్రంలో)
- 1899: వైద్యశాస్త్ర ప్రముఖుడు శొంఠి దక్షిణామూర్తి జననం (మ.1975).
- 1932: భారత దేశానికి చెందిన ఆర్థిక వేత్త, రిజర్వ్ బ్యాంకు గవర్నరుగా పనిచేసిన సి.రంగరాజన్ జననం.
- 1947: భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు దిలీప్ దోషి జననం.



జాతీయ గణిత దినోత్సవం.


గోవింద సింగ్


శారదా దేవి


శ్రీనివాస రామానుజన్


సి.రంగరాజన్


దిలీప్ దోషి

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# 'ఫాలో ఆన్' ఆలోచనే లేదు

## .. నాటౌట్గాఉండాలనే ఆడా: ఆకాశ్ దీప్

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత్ గబ్బా టెస్టును డ్రా చేసుకోగలిగింది. వర్షం రావడంతోపాటు టెయిలెండర్లు కాస్త పోరాడారు. దీంతో ఐదు టెస్టుల సిరీస్లో 1-1తో ఇరు జట్లూ కొనసాగుతున్నాయి.




'పోరాడితే ఆ దేవుడు కూడా సాయపడతాడు' ఇది నిజమని ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత జట్టు విషయంలో తేలింది. 'ఫాలో ఆన్' గండం నుంచి కష్టపడి బయటపడిన టీమిండియాకు వరుణుడు అండగా నిలిచాడు. గబ్బా టెస్టులో చివరి రోజు వేగంగా ఆడి భారత్ను ఇరుకున పెడదామని భావించిన ఆసీస్కు నిరాశే మిగిలింది. వర్షం రాకతో మ్యాచ్ చివరి రోజు రెండు సెషన్ల ఆటసాగలేదు. అయితే, అంతకుముందు భారత్ను ఫాలో ఆన్ నుంచి టెయిలెండర్లు ఆకాశ్ దీప్, బుమ్రా గట్టెక్కించారు. మరీ ముఖ్యంగా ఆకాశ్ దీప్ సిక్స్, ఫోర్లతో దూకుడుగా ఆడాడు. బుమ్రాతో కలిసి చివరి వికెట్కు 47 పరుగులు జోడించాడు. ఇందులో 31 పరుగులు ఆకాశ్ దీప్వే మెల్బోర్న్ వేదికగా గురువారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఆకాశ్ దీప్ గబ్బా పోరాటం గురించి ఆసక్తికర విశేషాలను వెల్లడించాడు."మేం లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్కు దిగాం. కనీసం 30 పరుగుల భాగస్వామ్యం అందించాలని భావించాం. నా మైండ్సెట్ కూడా అలానే ఉంది. అప్పుడు ఫాలో ఆన్ గురించి ఆలోచించలేదు. నాటౌట్గా మాత్రమే ఉండాలని అనుకున్నా. దేవుడి దయతో ఫాలో ఆన్ గండం నుంచి బయటపడ్డాం. ఆ పరిస్థితుల నుంచి మ్యాచ్ను కాపాడుకోవడంతో జట్టులో జోష్ వచ్చింది. మా డ్రెస్సింగ్ రూమ్ కూడా సంతోషపడింది. ప్రతి ఒక్కరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆస్ట్రేలియాలో ఆడటం నాకు ఇదే మొదటిసారి. బుమ్రా భాయ్ ధైర్యం నింపాడు. 'మరీ ఎక్కువగా ఆలోచించొద్దు. ఆటపైనే దృష్టిపెట్టు. భారత్లో ఎలా ఆడతావో.. అలానే ఇక్కడా నీ కర్తవ్యం నిర్వర్తించు' అని బుమ్రా చెప్పాడు" అని ఆకాశ్ వ్యాఖ్యానించాడు.మెల్బోర్న్ టెస్టు కోసం భారత జట్టు తీవ్రంగా సాధన చేస్తోంది. ఈ క్రమంలో కెప్టెన్ రోహిత్ శర్మ గాయపడినట్లు వార్తలు వచ్చాయి. వాటిపై ఆకాశ్ దీప్ స్పందించాడు. "క్రికెట్లో గాయాలు సాధారణమే. కానీ, రోహిత్ విషయంలో ఇదేమీ సమస్య కాదు. అంతా బాగుంది. తప్పకుండా అతడి ఆటను మెల్బోర్న్ టెస్టులో చూస్తాం. ఇందులో అభిమానులు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదు" అని వెల్లడించాడు.

## ప్రెగ్నెన్సీ పేరెంటిగ్




చాలామందిని ఎఫెక్ట్ చేసే సమస్యలో యూరిక్ యాసిడ్ కూడా ఒకటి. ఈ సమస్య చాలా ఇబ్బంది పెడుతుంది. చలికాలంలో మరింత దారుణంగా మారుతుంది. మనం తీసుకునే ఫుడ్స్లోని ప్యూరిన్స్ విచ్ఛిన్నమైనప్పుడు శరీరంలో యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. ఈ యూరిక్ యాసిడ మూత్రం ద్వారా బయటికి వెళ్తుంది. కానీ, కొన్నిసార్లు ఇది బాడీలో ఎక్కువగా అయినప్పుడు అనేక సమస్యలొస్తాయి.అందుకే, ఈ సమస్యని తగ్గించుకునేందుకు చాలా మంది అనేక ప్రయత్నాలు చేస్తారు. ఇంటి చిట్కాలు కూడా ఈ సమస్యకి బాగానే పనిచేస్తాయి. ఇందులో జీలకర్రతో చేసిన డ్రింక్స్ కూడా సమస్యని తగ్గిస్తాయి. అదెలానో తెలుసుకోండి.

# బాడిలోని యూరిక్ యాసిడ్ బయటికి వెళ్లాలంటే .. జీలకర్రని ఇలా తీసుకోండి

### యూరిక్ యాసిడ్ పెరిగితే..



బాడీలో యూరిక్ యాసిడ్ పేరుకుపోయినప్పుడు కీళ్ల సమస్యలకి దారి తీస్తుంది. అందులో గౌట్, ఆర్థరైటిస్ సమస్యలొస్తాయి. దీంతో పాటు మూత్రపిండాల్లో రాళ్ళ సమస్య పెరుగుతుంది. గౌట్, కిడ్నీ స్టోన్ సమస్యలు వస్తే.. చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీని వల్ల రోజువారీ పనులు చేయడం కూడా కష్టంగా మారుతుంది. ఈ సమస్యకి జీలకర్రతో చెక్ పెట్టొచ్చు. అదెలానో తెలుసుకోండి.

### జీలకర్ర నీరు..



జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గుతాయి. దీనికోసం ముందురోజు రాత్రి జీలకర్రని నీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే ఈ నీటిని పరగడపున తీసుకోవాలి. దీని వల్ల బాడీలో యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గుతాయి.

### జీలకర్ర టీ..




జీలకర్రని టీలా తీసుకున్నా కూడా సమస్య తగ్గుతుంది. దీనికోసం కప్పున్నర నీటిని తీసుకుని అందులో టీ స్పూన్ పరిమాణంలో జీలకర్ర వేయండి. 10 నిమిషాల పాటు మరగనివ్వండి. దీనిని మీరు వడగట్టుకుని తాగండి. రెగ్యులర్గా తాగితే సమస్య తగ్గుతుంది

### జీలకర్ర, నిమ్మరసం జ్యూస్..




దీనికోసం ముందుగా నీటిలో జీలకర్ర పొడి, నిమ్మరసం వేసి బాగా కలపండి. దీనిని తాగండి. రెగ్యులర్గా తాగితే రిజల్ట్ ఉంటుంది. దీంతో జీర్ణ సమస్యలు కూడా తగ్గుతాయి. దీని వల్ల జీర్ణ సమస్యలు కూడా తగ్గుతాయి. రెండూ కూడా ఇంట్లోనే దొరికేవి కాబట్టి, హ్యాపీగా తీసుకోవచ్చు.

### జీలకర్ర బనానా స్మూతీ..



ముందుగా అరటిపండు తీసుకుని బ్లెండ్ చేయండి. అందులోనే కొద్దిగా జీలకర్ర పొడి, నీరు వేసి మ-రోసారి తిప్పండి. దీనిని చక్కగా ఎంజాయ్ చేయండి. దీని వల్ల కడుపు నిండుగా కూడా ఉ ంటుంది. సమస్య కూడా తగ్గుతుంది.

### జీలకర్ర, పెరుగు..



దీనికోసం జీలకర్రని కొద్దిగా రోస్ట్ చేయండి. దీనిని పెరుగులో వేసి కలపండి. ఈ పెరుగుని ఎంజాయ్ చేయండి. దీంతో యూరిక్ యాసిడ్ తగ్గుతుంది. ఈ రెండింటిని కలిపి తీసుకుంటే కడుపులో కూడా ప్రశాంతంగా ఉంటుంది. కడుపుకి సంబంధించిన చాలా సమస్యలు దూరమవుతాయి.

### ఉసిరితో..



ముందుగా ఉసిరి పొడి, జీలకర్ర పొడి తీసుకోండి. ఈ రెండింటిని సమాన పరిమాణంలో నీటిలో కలపండి. దీనిని బాగా మిక్స్ చేసి తాగేయండి. దీంతో జీర్ణ సమస్యలు తగ్గుతాయి. జీలకర్రని ఒకేసారి పొడిలా చేసి పెట్టండి. ఉ సిరి పొడి మార్కెట్లో దొరుకుతుంది. లేదా ఎక్కువగా దొరికినప్పుడు ముక్కలుగా కట్ చేసి ఆరబెట్టి పొడిలా చేసి పెట్టుకుని వాడండి.

### దీంతోపాటు..



జీలకర్రని మనం మన డైట్లో అనేక రకాలుగా వాడొచ్చు. దీంతో యూరిక్ యాసిడ్ లెవల్స్ని కంట్రోల్ చేయొచ్చు. అదెలా అంటే..మనం తీసుకునే ఆహారంలో కొద్దిగా జీలకర్ర పొడి వేయొచ్చు. అన్నంలో జీలకర్ర కలిపి వండొచ్చు. పప్పులో కూడా జీలకర్ర కలపొచ్చు. సూప్స్లో జీలకర్రని యాడ్ చేయొచ్చు.

### జీలకర్రతో లాభాలు..



జీలకర్ర తీసుకోవడం వల్ల యూరిక్ యాసిడ్ లెవల్స్ తగ్గడంతో పాటు బాడీ డీటాక్స్పై అవుతుంది. జీర్ణ సమస్యలు దూరమవుతాయి. బ్లోటింగ్, అసిడిటీ, కడుపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి.దీనిని తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీంతో యూరిక్ యాసిడ్ తగ్గుతుంది. జీలకర్రతో ఆర్థరైటిస్, వాపు, నొప్పులు తగ్గుతాయి. దీని వల్ల మూత్ర విసర్జన పెరిగి మూత్రం నుండి యూరిక్ యాసిడ్ బయటికి వెళ్తుంది. శరీరంలో (పి,హెచ్) లెవల్స్ని బ్యాలెన్స్ చేయొచ్చు. దీంతో కీళ్ళు, మూత్రపిండాల్లో యూరిక్ యాసిడ్ క్రిస్టల్స్ ఏర్పడవు. జీలకర్ర ఎంజైమ్స్ పిత్త స్రావాన్ని పెంచి జీర్ణక్రియని హెల్ప్ చేస్తుంది. ప్యూరిన్స్ని విచ్ఛిన్నం చేస్తుంది.